క్లుప్తంగా

అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ కేశవ్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ


వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్తరమణ

ఉరవకొండ: అపద్ధాలు, మోసాలకు కేరాఫ్ కేశవ్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెస్త రమణ మాట్లాడారు. ఎమ్మెల్యే కేశవ్ నోరు విప్పితే అబద్ధాలు, అసత్యాలేనని, ఈవిషయంలో చంద్రబాబును మించిపోయాడన్నారు. ఎమ్మెల్యేగా కేశవ్ 20 ఏళ్లుగా పనిచేశారని, అప్పుడు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, సంక్షేమానికి చేసిన ఖర్చు ఎంతో తెలియజెప్పాలన్నారు. నియోజకవర్గంలో కేశవ్ సాగించినంత దోపిడీ ఎవరూ చేసి ఉండరన్నారు. గాలిమరల్లో పేద రైతుల భూములతో రూ.కోట్లు వ్యాపారం చేసి, వారి నోట్లో మట్టి కొట్టారన్నారు. నీరు–చెట్టు పేరుతో కేశవ్ అనుచరులు చేయని పనులను చేసినట్టు చూపి దోచుకున్నారు. కూడేరు మండలంలో కొండగుట్టలకు పట్టాలు చేసి తెలుగు తమ్ముళ్లకు తప్పుడు పాసుపుస్తకాలు చేయించిన ఘనత కేశవ్‌కు దక్కుతుందన్నారు. తన సొంత గ్రామమైన కొకుంట్లలలో అతి పెద్ద జూద కేంద్రం కేశవ్ కనుసన్నల్లోనే జరిగేదని, రోజూ ఆట రూపంలో రూ. 70 లక్షలు చేతులు మారేదన్నారు. నియోజకవర్గంలో అరాచక శక్తులను పెంచిపోషించిన పయ్యావుల కేశవ్..ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశారా అని ప్రశ్నించారు. బీజేపీ, టీడీపీ కలిపిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వస్తోందని కేశవ్ కలలు కంటున్నారన్నారు. అది డబుల్ ఇంజన్ ప్రభుత్వం కాదని ట్రబుల్ ఇంజన్ అని ప్రజలు కూటమికి గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. ఉరవకొండలో కేశవ్ చిత్తు చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణీసుస్మిత


రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: 2024 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణీసుస్మిత చెప్పారు. సోమవారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో శాసన సభ నియోజకవర్గంలోని ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్‌ఓ సమీక్ష నిర్వహించారు. నామినేషన్ దాఖలు ఎలా చేయాలి..? ఎన్ని సెట్లు వేయాలి..అభ్యర్థులను ఎంత మంది ప్రతిపాదించాలన్న పూర్తి వివరాలు తెలియజేశారు. ఎన్నికల వ్యయం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సీ విజిల్ యాప్, సువిధ యాప్, ఎన్‌కోర్ యాప్‌లపై అవగాహన కల్పించారు.

వడదెబ్బ ప్రాణాంతకం


వడదెబ్బపై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయ పరిస్థితులు తలెత్తవచ్చని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ డాక్టర్ కుమారరాజా హెచ్చరించారు. సోమవారం మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో వడదెబ్బ, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది మాట్లాడుతూ ఎండవేడిమితో శరీర ఉష్ణోగ్రతలు పెరిగి, మెదుడుపై ప్రభావం ఉంటుందని, వడదెబ్బకు గురవుతారన్నారు. అనంతరం ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, నాగమణి, జైనాబీ, గౌతమి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి


ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుందుర్పి: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ హనుమంతు ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని కుందుర్పి, బెస్తరపల్లి, తూముకుంట, తెనగల్లు తదితర గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఈఓ తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శి ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది సందడి


దుస్తుల కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న ఓ దుకాణం


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఉరవకొండ క్లాక్‌టవర్ సర్కిల్

రాయదుర్గంటౌన్: ఉగాది పండుగను పురస్కరించుకొని పండ్లు, సామగ్రి, దుస్తుల కొనుగోళ్లు, ఇతర వ్యాపారాల కోసం వచ్చిన గ్రామీణులు, పట్టణవాసులతో రాయదుర్గం వీధులు కిటకిటలాడాయి. పట్టణంలోని కిరాణాషాపులు, దుస్తుల షాపులు, రెడిమేడ్ గార్మెంట్స్, కూరగాయల మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. మెయిన్ బజార్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, కూరగాయాల షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో రద్దీగా మారాయి. వాహనాలతో పాత బస్టాండ్ నుంచి వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

దుకాణాల్లో ఉగాది సందడి

ఉరవకొండ: ఉరవకొండ పట్టణానికి ఉగాది సందడి నెలకొంది. సోమవారం పండుగ నేపథ్యంలో కొనుగోలుదారులతో క్లాక్‌టవర్ ప్రాంతం కిటకిటలాడింది. పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో ఉదయం 6 గంటల నుంచే వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నుంచి ఉరవకొండకు వచ్చి పండుగ సామగ్రి కొనుగోలు చేశారు. మామిడి ఆకులు, పూలు, పండ్లు, మామిడి కాయలు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు.

సందడిగా మారిన మెయిన్‌బజార్

వజ్రకరూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం మండల కేంద్రం వజ్రకరూరులోని మెయిన్ బజార్‌లో ఉగాది పండుగను పురస్కరించుకుని సందడి వాతావరణం నెలకొంది. ప్రజలు మావిడాకులు,కాయగూరలు కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. దుకాణాలు,కిరణా షాపుల వద్ద ప్రజలు పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున వచ్చారు.


రాయదుర్గంలో కొనుగోలుదారులతో మార్కెట్

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు


మెట్టు గోవిందరెడ్డి


తలారి రంగయ్య


వై. విశ్వేశ్వర రెడ్డి

రాయదుర్గం: నియోజకవర్గంలోని ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి 'శోభకృత్' నామ 'ఉగాది' పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లోనూ శుభాలను చేకూర్చాలని ఆకాంక్షించారు. సాగు, తాగునీరు, పచ్చని పంటలతో నిత్య వసంతం విరాజిల్లేలా భగవంతుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని కోరుకున్నారు.

ఉరవకొండ: తెలుగు సంవత్సరాది ఉగాది రోజున ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు నెలకొనాలని ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కళ్యాణదుర్గం: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలారి రంగయ్య ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికీ కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

- కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పర్వదినాన ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలుగు వారి కొత్త సంవత్సరాన్ని సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమివ్వండి!




టీ కొట్టువద్ద కూర్చొని ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి. ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని సత్కరించిన మైనార్టీ కుటుంబం

- ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రాజకీయాల్లో తనకు ఇదే చివరి అవకాశం..మ్మెల్యేగా ఈ ఒక్క అవకాశం ఇవ్వండి..త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించండి.. రాయదుర్గాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్ది చూపుతానని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, కౌన్సిలర్లు కొంతెం దేవరాజు, తట్టే మంజు, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు పోరాళ్ల శివ, వరకూటి హంపారెడ్డి, పీ వెంకటరెడ్డితో కలిసి కణేకల్లు, బళ్లారి రోడ్డుల్లోని ప్రధాన టీ కొట్టు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే పలు వార్డుల్లోని ప్రముఖులను కలుసుకుని పార్టీకి మద్దుతు కూడగట్టారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు చరిత్రాత్మక అవసరం..

గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి చూసి వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపైనే ఓటేయ్యాలని మెట్టు గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం మెట్టు విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలుపు చరిత్రాత్మక అవసరమన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉంటేనే పేదల జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చెప్పుకోవటానికి ఒక్క పథకమూ లేదన్నారు. మళ్లీ అధికారమిస్తే చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ చెప్పే మోసపూరిత వాగ్దానాలను ఏ ఒక్కరూ నమ్మొద్దని తెలియజేశారు. తన రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏపీఐఐసీ లాంటి కీలక పదవులు అనుభవించానని, అయినా చిన్న అవినీతి మరక కూడా లేదన్నారు. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుది ఉత్తుత్తి షో అన్నారు. ఆయన్ను ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు కూడా నమ్మలేదన్నారు. బెంగళూరు నుంచి పది మంది ఐ–టీడీపీ వారిని రప్పించి, స్థానిక తమ్ముళ్లతో ర్యాలీ చేయించినట్లు అనిపించిందన్నారు. 2014లో రాయదుర్గం ప్రజల పుణ్యానా కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలిచి,, చీఫ్ విప్, మంత్రిగా పదవులు అనుభవించినా ఒక్కటంటే ఒక్క మంచి పని చేయలేదన్నారు. మరో 30 ఏళ్లు టీడీపీకి అధికారం పగటికలగానే మిగులుతుందన్నారు. కూటమి ఆలోచన పటాపంచెలు కాబోతుందన్నారు.

ఆశీర్వదించండి.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

రాయదుర్గంటౌన్: ప్రజాసేవకు తనకు జగనన్న రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని 11వ వార్డులో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గౌని శ్రీరామిరెడ్డిలతో కలిసి పలువురు ప్రముఖులు, ఆత్మీయులు, ఉద్యోగస్తులు, వ్యాపారులను కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ 99 శాతం హామీలు నెరవేర్చి దేశానికే ఆదర్శంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేసినట్లు చెప్పారు. ఐదేళ్ల టీడీపీ హయాంలో మంత్రిగా కాలవ శ్రీనివాసులు రాయదుర్గం అభివృద్ధిని కాలరాసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహీధర్‌రెడ్డి, విక్రమ్, సత్యనారాయణ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఉదారత

కళ్యాణదుర్గం: బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న బొమ్మనహాళ్ మండలం చంద్రగిరి పాఠశాల ఉపాధ్యాయుడు ముస్తాక్ అహమ్మద్ ఖాన్ పట్ల ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉపాధ్యాయుడు బద్దే నాయక్ ఉదారతను చాటుకున్నాడు. సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో ఎంఈఓలు శ్రీధర్, ఓబుళపతి, తిప్పేస్వామితో కలిసి బాధితుడికి రూ.20 చెక్కును అందించాడు.

తమ్ముళ్ల మధ్య భగ్గు మన్న విభేదాలు

కూడేరు: మండల కేంద్రంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ప్రచారంలో తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. సోమవారం సాయంత్రం కూడేరులో పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మారెమ్మ గుడిలో కేశవ్‌తో పూజలు చేయించి, అక్కడి నుంచి ప్రచారం ప్రారంభించాలనుకున్నారు. అక్కడికి నాయకులంతా చేరుకున్నారు. కాగా టీడీపీ జిల్లా నాయకుడు కుశాలు నాగరాజు జేసీబీతో కేశవ్‌కు గజమాల వేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఆయనకు వ్యతిరేక వర్గమంతా (బీసీ సామజిక వర్గం) నీవెందుకొచ్చావని గొడవకు దిగారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.లక్షల్లో దోచుకొని పార్టీకి నష్టం కలిగించావని, ప్రతిపక్షంలోకొచ్చాక పార్టీకి దూరంగా ఉండి ఇప్పుడు వస్తావా అని అడ్డుకోవడంతో అక్కడి నుంచి కుశాల నాగరాజు వ్యతిరేక వర్గమంతా బోయ వీధి వైపు వెళ్లారు. పయ్యావుల కేశవ్ రాగానే నాయకులంతా పూలమాలలు వేసి పాత బస్టాండ్ వైపు ప్రచారానికి తీసుకెళ్లారు. దీంతో కుశాల నాగరాజు, అతని వర్గం మారెమ్మ గుడి వద్దే ఉండిపోయారు. కుశాల నాగరాజును వ్యతిరేకిస్తున్న విషయం పయ్యావుల కేశవ్‌కు తెలిసినా ఇరువర్గాలను కలిపి ఒకతాటిపైకి తీసుకురాలేకపోయారు. కేశవ్ సమక్షంలోనే వర్గవిభేదాలు భగ్గుమనడం చర్చానీయాంశమైంది. గజమాల వేయనీకుండా అడ్డుకోవడం చాలా అవమానంగా ఉందని కుశాల నాగరాజు వర్గం ఆవేదన వ్యక్తం చేసింది.

10 నుంచి క్రాప్‌లోన్లు రెన్యూవల్

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఈ నెల 10 నుంచి క్రాప్‌లోన్లు రెన్యూవల్ చేసుకోవచ్చని బ్యాంకు మేనేజర్ ముస్తఫా సోమవారం తెలిపారు. 10 నుంచి 19 వరకు జల్లిపల్లి, 20నుంచి 29 వరకు కొర్రకోడు, 30 నుంచి మే 3 వరకు హంసాయపల్లి, పీఏబీఆర్ డ్యాం, 4 నుంచి 10 వరకు ఉదిరిపికొండ, 13 నుంచి 15 శివరాంపేట, 16 నుంచి 18 వరకు ఉదిరిపికొండ తండా, మరుట్ల–3 కాలనీ, 20 నుంచి 27 వరకు మరట్ల–1,2 కాలనీలకు చెందిన రైతులు రెన్యూవల్ చేసుకోవచ్చన్నారు.

'పయ్యావుల కేశవ్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు'


కూడేరు: మాట్లాడుతున్న మండల వైఎస్సార్ సీపీ నేతలు

కూడేరు: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. సోమవారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పయ్యావుల ఐదేళ్ల పాటు ప్రజలకు కనిపించలేదని, ఎన్నికలు రాగానే ఓట్ల కోసం వచ్చారన్నారు. కేశవ్ ఏ మొహం పెట్టుకొని ఎన్నికల ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. కేశవ్ మాయ మాటలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. అందుకే ఆయన ప్రచారానికి ప్రజాదరణ కరువైందన్నారు. కేశవ్ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి గెలుద్దామని పగటి కలలు కంటున్నాడని, అవన్నీ ఇప్పట్లో సాగవన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చాక పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. సమావేశంలో మండల జనరల్ సెక్రటరీ తోపుదుర్తి రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి శివరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, సంగమేశ్వర స్వామి ధర్మకర్త రామదుర్గం కిష్టప్ప, నేతలు శంకర్ రెడ్డి, సంగప్ప, ఈశ్వరయ్య, శీనా , ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

- మున్సిపల్ కమిషనర్ కిశోర్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కిశోర్

రాయదుర్గం: పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కణేకల్లు సమ్మర్ స్టోరేజీతో పాటు మున్సిపల్ నీటి పథకాలు కలుపుకొని నిత్యం 9.25 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వీటికి తోడు అత్యవసర పరిస్థితుల్లో రెండు ట్యాంకర్ల ద్వారా నీరిందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం నుంచి మరో రెండు ట్యాంకర్లు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వేసవి పూర్తయ్యే వరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా తాగునీటి కోసం ప్రత్యేక సెల్ తెరిచామన్నారు. కణేకల్లు సమ్మర్ స్టోరేజీలో సుమారు 1520 ఎంఎల్‌డీ నీరు నిల్వ ఉన్నా కొరత రానీకుండా జాగ్రత్తగా వినియోగిస్తున్నామన్నారు. రెండు లేదా మూడు రోజుల కోసారి తప్పక నీటి సరఫరాకు ప్రణాళికలు చేపట్టామన్నారు. కావాలనే కొందరు రాజకీయం చేసేలా కుట్రలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తే ఆరోపణలా?

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 6వ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తే తనపై ఆరోపణలు రావడం బాధాకరమని మున్సిపల్ కమిషనర్ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఆరో వార్డులో నీటి సమస్య ఉండడంతో ట్యాంకర్ పంపించామనానరు. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ ఇంట్లోని సంప్‌కు నీటి వదులుతుంటే స్థానికులు నిలదీశారన్నారు. విషయం తెలుసుకుని తాను ఘటన స్థలానికి వెళ్లి డ్రైవర్‌తోపాటు ఏఈని మందలించినట్లు తెలిపారు. ఇబ్బందులు లేకుండా మరో ట్యాంకర్ తెప్పించి నీరు సరఫరా చేయించినా తనపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు.

ఆంజనేయుని ఉత్సవాలు ప్రారంభం


అలంకరణలో ఆంజనేయస్వామి

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9 నుంచి 17 వరకు వివిధ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఉగాది పర్వదినం నాడు పంచాంగ శ్రవణం ఉంటుంది. 10న రాత్రి 7 గంటలకు ముత్యాల పల్లకి, 11న సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు తెలిపారు. 12న లంకా దహనం, 17న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తారు.

జాతరకు ముస్తాబైన అక్కమాంబ ఆలయం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో ఉన్న అత్యంత ప్రసిద్ధి చెందిన అక్కమాంబ ఆలయం జాతరకు ముస్తాబైంది, మంగళవారం అక్కమాంబ దేవత ఒంటిమిద్ది, కురాకులతోట, దేవాదులకొండ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం అక్కమాంబ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహిస్తారు. కర్ణాటక, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

సమయపాలన పాటించాలి

బెళుగుప్ప: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే అధికారులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎర్రగుడి, గంగవరం, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాల్లోని సచివాలయాలను ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, హౌసింగ్ ఏఈ శివారెడ్డితో కలిసి ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు జగదీష్, రామమూర్తి, పీఆర్‌జేఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కూడేరు: మండలంలో ఫ్లెయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ టీం అధికారులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు బ్రాహ్మణపల్లి, గొటుకూరు గ్రామాల్లో సోదాలు చేశారు. ఎస్ఎస్‌టీ టీం అధికారులు అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై, కూడేరులో సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు.

విద్యార్థులకు హెల్త్ కేర్ ప్రొడక్ట్స్ పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఎస్‌వీజీఎం డిగ్రీ కాలేజ్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ అయిన హ్యాండ్‌వాష్‌లు, క్యాల్షియం మాత్రలు, టూత్ పేస్టలను విన్మార్గ్ బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ 300 మంది విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశాడు. కళాశాల ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి తదితరులు హాజరయ్యారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లి వలంటీర్ల 20 మంది సోమవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ అమృతరాజ్‌కు రాజీనామా పత్రాలను అందించారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని డి.కొండాపురం సచివాలయ పరిధిలోని 8 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. హెచ్. ప్రశాంతి, ఎస్.బాబా ఫకృద్దీన్, కే నరేష్, డి.అఖిల, వి.నెట్టిప్ప, ఎస్. మల్లికార్జున, యం .శివబాబు, డి.తిమ్మ రాజు రాజీనామా చేశారు.

కంబదూరు: మండలంలోని అండేపల్లి గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. గ్రామ వలంటీర్లు హరి, వెంకటేష్, హరికృష్ణ రాజీనామా చేశారు.

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన 8 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లు అంజలి, రాధిక, కృష్ణవేణి, జబీనా, రాజన్న, గణేష్, అంజేష్, సురేంద్ర రాజీనామా చేశారు.

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లు జయకృష్ణ, సంగమేశ్వర, ఈశ్వరయ్య, బసవరాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు స్వచ్ఛందంగా రాజీనామా చేసి, లేఖలను ఎంపీడీఓ విజయలలితకు అందించారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని హనిమిరెడ్డిపల్లి సచివాలయ వలంటీర్లు ఎనిమిది మంది రాజీనామాలను పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, అధికారులు చంద్ర, వెంకటనారాయణకు సోమవారం అందించారు.

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం సచివాలయ పరిధిలోని గూళ్యపాళ్యం, కమలపాడుకు చెందిన 17 మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. గూళ్యపాళ్యం గ్రామ వలంటీర్లు రాజశేఖర్, శ్రీకాంత్, మల్లికార్జున, రాజశేఖర్, సిద్దయ్య, మురళి, జ్యోతి, కమలపాడు వలంటీర్లు శృతి, జ్యోతి, సల్మాన్, అరుణ, నవీన్, నగేష్, మహేష్, ఖాసీమ్, కళ్యాణ్, కుమార్‌నాయక్ తదితరులు రాజీనామా చేశారు.

ఓటరు జాబితాతో తిరుగుతున్న వారిపై ఫిర్యాదు


ఎంసీసీ అధికారి అమృతరాజ్‌కు ఫిర్యాదు చేస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్ మనోహర్

ఉరవకొండ: పట్టణంలోని ఎస్ఎల్ఎన్ కాలనీ బూత్ నెం–120 పరిధిలో ఓటరు జాబితాతో ఓటర్ల వివరాలు సేకరిస్తున్న కొంతమంది యువకులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అధికారులకు అప్పగించారు. కొంతకాలంగా టీడీపీ నాయకులను వెంట బెట్టుకొని స్థానికేతరులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సమాచారం తెలుసుకుంటున్న వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుకున్నారు. అయితే అధికారుల విచారణలో నిజాలు బయటకు రావాల్సి ఉంది. సోమవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో పాటు ఎంసీసీ నిర్వహణ అధికారి అమృతరాజ్‌కు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, జోగి హనమంతు, జోగిభీమా, బూత్‌లెవెల్ ఏజెంట్ మనోహర్ ఫిర్యాదు చేశారు. మనోహర్ మాట్లాడుతూ 120వ బూత్ పరిధిలో అనంతపురానికి చెందిన యువకులు ఓటరు జాబితాతో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారన్నారు. దీన్ని గమనించి నిలదీయగా, తమను జాయింట్ కలెక్టర్ నియమించారని, అందుకే ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తామన్నారని తెలియజేశారు. సర్వే చేయమని ఆదేశాలున్న ఆర్డర్ చూపించాలని ప్రశ్నించగా, గొడవకు దిగారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సర్వే చేస్తున్న యువకులను ఎంసీసీ అధికారులకు అప్పగించారు. దీనిపై విచారణ జరిపి యువకులపై కేసు నమోదు చేయాలని బూత్ కన్వీనర్ తో పాటు పార్టీ నాయకులు కోరారు.

రూ.4.39 లక్షల నగదు పట్టివేత

కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న నగదును చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కంబదూరు సమీపంలోని చెక్ పోస్టు వద్ద సోమవారం ఉదయం ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది, ఎఫ్ఎస్‌టీ ఫక్కీరప్ప, మునీర్ వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో (కేఏ 04బీ 3476) వాహనాన్ని ఆపి పరిశీలించగా రూ.4.39 లక్షల నగదు బయటపడింది. ఈ మొత్తానికి సంబంధించి ఎలాంటి ఆధారాలను చూపక పోవడంతో నగదు సీజ్ చేసి, తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని, నగదను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మితకు అప్పగించారు.

అటవీ సంరక్షణాధికారులను నియమించండి

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అడవికి సంరక్షణాధికారులను నియమించాలని ఎంపీపీ నాగరాజు, సర్పంచ్ గంగాధర తదితరులు కళ్యాణదుర్గం రేంజ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ప్రస్తుతం ఒక బీట్ అధికారి మాత్రమే పని చేస్తున్నారని, ఆయన కూడా అధికారిక కార్యక్రమాలు, సమావేశాలకు పరిమితమవుతున్నారన్నారు.